




**-5-**

# పింగళి సూరన కళాపూర్ణోదయం

"నావెల్లా" అన్న సరికొత్త సాహిత్యరూపముగా పుట్టకమునుపు, యూరప్ లోని సాహిత్యములో కొత్తపోకడలు ఇంకా మొగ్గలెయ్యకమునుపు, షేక్సుపియరు వంటి దిగ్గజాలు జన్మించక మునుపు, ప్రపంచ సాహిత్యములో లేని ఒక కొంగొత్త ప్రక్రియను మన తెలుగు సాహిత్యము తెచ్చి, తెలుగును విశ్వసాహిత్యపు వినువీధులలో ఊరేగించిన ఘనత ఒక మహాకవికి దక్కుతుంది. ఆ మహాకవి పింగళి సూరన. ఆ కావ్యము "కళాపూర్ణోదయము". సమకాలీనుల గౌరవము అందుకున్న ఈ మహాకవి కృష్ణదేవరాయల తదనంతరము వచ్చి వుండవచ్చు. ఆయన సభలోని అష్టదిగ్గజములలో వుండక పోవచ్చును.

తెలంగాణా, మహారాష్ట్ర సరిహద్దులలో 'పింగళి ' అన్న గ్రామము వుంది. ఈ మహాకవిది ఆ గ్రామం కావచ్చునన్న కొందరి అభిప్రాయము. కర్నూలు వద్ద వున్న నంద్యాల అని కొందరి భావన. మొత్తానికి తెలుగు మహాకవి అయిన పింగళి సూరన్న కృష్ణరాయలు తరువాతి వాడుగా మాత్రము చెప్పవచ్చు. ఆయన ఒక కావ్యము ఆకువీటి పెదవెంకటాద్రికి రాజుకు అంకితమిచ్చాడు కాబట్టి.

రాయలు కాలములో వచ్చిన సాహిత్యసృష్టి మహోన్నతమైనది. సువర్ణయుగములో జన్మించిన సూరన్న చిన్ననాటి నుంచే శివభక్తితో వున్నాడు. ఆనాటి సాహిత్యంలో ఒక స్థానము సంపాదించుకోవటము కోసము కొత్త పుంతలు తొక్కుతున్నారు కవులు. ఇది ప్రయోగశీలమంటారు. ఆ కొత్త దారులను త్రొక్కినాడు సూరన్న. ఇలా ఈ చారిత్రిక దశలో కలము పట్టి నిలచినాడు సూరన. తన ముద్ర వెయ్యటానికి ఆయన ఎవ్వరూ చెయ్యని పని చేపట్టినాడు. అదే "గరుడ పురాణము" అన్న పురాణమును ఆంధ్రీకరించడము. విష్ణువు గరుడకు చెప్పిన విషయము. కేవలము మైల దినాలలో తప్ప ముట్టరు ఈ

పురాణమును. ఇందులో జీవుడు బొందిని విడిచిపెట్టాక ఎన్ని యాతనలు అనుభవిస్తాడో వివరాలు వుంటాయి. అది రచించినట్లు అనంతర రచనలలో చెప్పకున్నాడు కాబట్టి ఆయన రచన అది అని మనకు తెలుస్తుంది.

'నవ్యప్రకారము' ఏదైనా 'భవ్యకావ్యము' రచించాలని కుతూహలపడ్డాడు. ఇలా వున్న సందర్భములో ఆకువీటి పెదవెంకటాద్రికి మరో కుతుహలముతో తెలుగులో శ్లేషతో రెండు అర్ధాలు వచ్చేలా కావ్యము రాయించుకోవాలనుకున్నాడు. ప్రతి పద్యంలో రెండర్థాలు వచ్చేటట్టు ద్విసంధాన కావ్యం వినాలని ఉత్సాహపడ్డాడు. రెండర్థాలతో ఒక్క పద్యము చెప్పటమే కష్టము. అలాంటిది మొత్తము కావ్యమంతా ప్రతి పద్య శ్లేషతో వ్రాయటము సామాన్యము కాదు. సూరన ప్రౌఢిమతో ఆ విధంగా భారత రామయణేతి వృత్తాలను, శ్లేషగా మలచి నిర్మించినదే "రాఘవపాండవీయము".

"రెండర్థంబుల పద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబు గా
కుండుం దద్గతి గావ్యమెల్ల నగునే నోహో యనంజేయదే।
పాండిత్యంబున నందునుం దెనుగుకబ్బం బద్భుతం బంద్రు ద
క్షుం డెవ్వాడిల రామభారతకథల్ జోడింప భాషాకృతిన్॥"

రాఘవపాండవీయములో మనకు కనిపించే అద్భుత శ్లేష పద్యాలలో మనను కట్టిపడేసేది వసంత ఋతు వర్ణన.

"అంత వసంత మొప్పె జరమాగ్రిమ భగా చరాఖిలర్తు సా
మంత, మనంత జాలక సమంజస రంజిత కుంజ కుంజరో
ద్వాంత నితారత సాంద్ర మధు దాన విజృంభిత బంభర స్వనా
త్వంత నిరంతరీకృత దిగంత, సుతారత లతాంత కుంతమై॥"

ముందు వెనక నడుస్తున్న మిగిలిన ఋతువులు వసంతమునకు సామంతులట. లతాంతమనే కుంతాన్ని (పువ్వు అనే ఆయుధము) ధరించిన మన్మథుడు అలసట లేకుండా సంచరిస్తున్నాడుట. ఇంత అందమైన భావాన్ని, ఇంత అందమైన కూర్పుతో, వినడానికీ అనడానికి, కనడానికి అనువుగా అందించాడు సూరన.

పింగళి సూరన పేర చాలా రచనలే వినవస్తాయి. "గిరిజాకల్యాణము" ఆయన రాసిన మొదటి కావ్యము. కాని అది నేడు అందుబాటులో లేదు. "రాఘవపాండవీయం" వ్రాసిన తరువాత సూరన గారి దృక్పథంలో చాలా మార్పులే వచ్చాయి.

విశిష్టాద్వైతిగా మారాడు. కేరళ నుంచి కాశ్మీరము వరకూ భారతదేశమును ఒక్కటిగా మనఃఫలకము పై చూసాడు. సుపరిచితమైన పదాలే వాడాలని అనుకున్నాడు. ఈ మహాకవిలో వచ్చిన మార్పును పసికట్టిన నాటి రాజు నంద్యాల కృష్ణంరాజు మహాప్రబంధమును చేయించదలుచుకున్నారు. సకల లక్షణలక్షితమైన మహాప్రబంధము విధాయకమని తలచాడు రాజు. ప్రభువు కోరిక మేర "కళాపూర్ణోదయము" అన్న ప్రబంధము రాయదలిచాడు సూరన. ఇది సుమారు 1560-1620 మధ్య రచించి యుండవచ్చని పరిశోధకులంటారు.

ఆ ప్రబంధములో మూడు విశేషాలు వుంటాయని చెప్పారు.

ఆత్మపూర్వకథాసంవిధాన వైచిత్రి , శృంగారప్రాయత, పుణ్య వస్తు వర్ణనాకర్ణనీయత. ఈ మూడు విశేషాలను పాటించాడు సూరన.

నాటి వరకూ ప్రబంధాలకు ఇతివృత్తము కేవలము పురాణాల నుంచో, రామాయణ భారతము నుంచో తీసుకునేవారు. స్వయంగా కథను కల్పించి, సజీవ స్వతంత్ర రచన చెయ్యలేదు. సూరననే ఆ మొట్టమొదటి ప్రయత్నం చేశాడు. అలా సాహిత్యములో మొదటి "నవల"(fiction) రచించబడినది.

ఇందులో ఎన్నో విశేషాలు వున్నవి.

కవి స్వయంగా చెప్పే కథ కన్నా పాత్రల సంభాషణల ద్వారా పూర్వ కథ తెలిపే పద్ధతి. కొంత నవల లాగా, కొంత నాటకములా, కొంత సినిమాలాగా, ఫ్లాష్‌బ్యాక్ తోనూ ఈ రచన సాగుతుంది. వర్ణనలతో కథాంశము సూచించటము, కథలోని అంశములను అనుసంధానించటము వంటి కొంగొత్త మార్గాల వల్ల ఇది చదివిన వెంటనే అర్థముకాదు. అర్థము స్ఫురించినా, అంతరార్థము అర్థము చేసుకోవటానికి కొంత సమయము పడుతుంది. చదివిన ప్రతివారికీ కమ్మని విందు చేస్తుందనటములో సందేహామే లేదు. పూర్తి రసానందాన్ని కలిగిస్తుంది.

ఇందులో ఇతివృత్తము నూతనము. కథను ఎంతో ఉత్కంకఠతో నడిపిస్తాడు కవి. వివిధ పాత్రలూ సంఘటనలూ వస్తూ వుంటాయి. చివరకు అన్నీ సంధాన పరచబడుతాయి. ఈయన వర్ణన విలక్షణమైనది. కథాసరణి నుంచి దృష్టి మర్చలకపోవటము, అనవసరపు వర్ణనలు చెయ్యకపోవటము ఈయని రచనలలో కనపడుతుంది.

ద్వాపర, కృష్ణుడు, సత్య, జాంబవతీ, నారదుడు, తుంబురులు మొదలైన పురాణపాత్రలు, మణికంధరుడు, కలభాషిణి, మణిస్తంభుడు మొదలైన కల్పిత పాత్రలను జోడించి, నారద గానామృత ఘట్టాన్ని కల్పించి, స్వర్గ మర్త్యాల మధ్య సంబంధాన్ని కలిగించిన కథే ఈ "కళాపుర్ణోదయము".

కళాపూర్ణోదయము కథ సంగ్రహము టూకీగా:

కలభాషిణి వారకాంత. ఆమె నివాసము ద్వారక. కృష్ణుడు పాలించే కాలమది. ఆ సమయములో ఆమె ఉయ్యాల ఊగుతుంటే ఆమె కాళ్ళు ఆకాశము వైపు వస్తుంటే, అటుగా వచ్చిన నారదుడు శిష్యుడైన మణికంధరుడుతో, "ఆమె అందము అప్సరసల తలలను తంతునట్లుగా వుంద"ని అంటాడు. అటుగా వెడుతున్న రంభ, నలకుభేరులకు అది వినపడుతుంది. రంభ, మహర్షిని అలా మాట్లాడటానికి కారణము కినుకగా అడిగి మహర్షి కోపానికి కారణమవుతుంది. నారదులవారు, రంభకు సవతి వచ్చినా వచ్చునేమో అని ఊరుకుంటాడు.

రంభా, నలకూభేరుల సంభాషణలో కళాపూర్ణుడి గురించి వస్తుంది. వివరములు పాఠకులకు తెలియవు. రంభా నలకూభేరుల సంభాషణ విన్న కలభాషిణి నారదులవారితో కళాపూర్ణుడి గురించి అడుగుతుంది. ఆయన వివరములు చెప్పడు. అలా చదువరులకు సస్పెన్స్ పెంచుతాడు కవి. ఈ కళాపూర్ణుని గురించి మనకు చివిరి వరకూ తెలియదు. అలా ఆ పట్టు విడవక కథను నేర్పుగా నడుపుతాడు.

నారదుల వారు కృష్ణుణి వద్దకు సంగీతము నేర్చుకునేందుకు వస్తూ ఉంటాడు. ఒకనాడు ఆయన పాడగా కృష్ణుడు, కృష్ణ సతులు మెచ్చుకుంటారు. వారి మెప్పు నిజమా కాదా అని అనుమానము కలుగుతుంది నారదునికి. కలభాషిణి మారు రూపములో వెళ్ళి వారు చెప్పనది నిజమని తెలుసుకొని చెబుతుంది. ఆమెకు మారు వేషము సహాయపడే విద్యను నారదులు ప్రసాదించి వెళ్ళిపోతాడు.

అటు పై కలభాషిణి పాడుకుంటూ వుండగా ఒక సిద్ధుడు వస్తాడు. ఆ సిద్ధుడు ఆమె పాట కోసము వచ్చానంటాడు. అతనిని నలకుబేర రంభలెమి చేస్తున్నారని అడుగుతుంది. సిద్ధునితో కీలుగుర్రముపై వారున్నచోటకు వెడుతూ మధ్యలో ఆగుతారు. అక్కడో దేవి ఆలయము వుంటుంది.

సిద్ధుడు, కలభాషిణి ఆ ఆలయములో ప్రవేశించినప్పుడు ముసలి అవ్వ చూస్తుంది. ఆ అవ్వ సముఖాసత్తి. ఆమె కలభాషిణితో "సిద్ధుడు ఆమెను అమ్మవారి బలికి తెచ్చాడని, అక్కడి శాసనము చదవమని" చెబుతుంది. ఆ అవ్వ కలభాషిణిని తప్పించుకోమని చెప్పటముతో కథ మలుపులు తిరుగుతుంది.

కథలో కథగా కాశ్మీర దేశపు సరస్వతీ దేవాలయము, చరిత్ర గురించి నడుస్తుంది. శారదాపీఠం పోసినదే తీర్థము. అక్కడి వాళ్ళు మెచ్చినదే కవిత్వం. ఆ విషయము కూడా సూరన వదలలేదు. ఈ సందర్భములో సుగాత్రీశాలీనుల కథను పరిచయము చేస్తాడు కవి. వారి కథ వింత మలుపులు తిరుగుతుంది. అటు పై బ్రహ్మ, సరస్వతుల సరస సంభాషణనతో, వారి పెంపుడు చిలకతో ముచ్చట్లతో మరో మలుపు. ఇన్ని మలుపుల వలన మనకు కళాపుర్ణుడి మీద మరింత ఉత్సుకత ఏర్పడుతుంది.

నాటకీయ సంఘనలు మధ్య కథ నడిచి, రంభా,నలకుభేరులను మాయా రూపులుగా చూపి, తిరిగి ఆలయము చేరటము...ఇత్యాదివి చదవరులకు ఉత్కంఠ కలిగిస్తాయి.

ఐదవ అశ్వాసములో కథ రాజుగారైన కళాపూర్ణుడి సభలో నెలల బిడ్డ మణిహారము చూచి మాట్లాడటము, కళాపూర్ణుడి పూర్వ కథ చెప్పటముతో అప్పటి వరకూ వున్న ఉత్కంకతత వీడుతుంది. ఐదవ అశ్వాసములో అందరూ ఒక దగ్గరకు జతకూడుతారు. కథలో వచ్చిన చిక్కముళ్ళు విడిపోయి, కథ తేటతెల్లమవటము జరుగుతుంది.

ఇందులో బ్రహ్మదేవుడు, సరస్వతుల సంభాషణ, శృంగార వర్ణనన విస్తారముగా వుంటుంది.

ఐదవ అశ్వాసములో కథ అయిపోతుంది. కాని ఇది ఎనిమిది అశ్వాసముల ప్రబంధము.

కానీ జి.వీ. కృష్ణారావు గారు మాత్రము కళాపూర్ణోదయములో ప్రతి పద్యపు అంతరార్థము వివరించి ప్రతి పద్యము అవసరము వివరించారు.

సూరన గారి ఉద్దేశంలో కళాపూర్ణోదయములోని ఇతివృత్తము కళ యొక్క పూర్ణోదయము. ఇది మనకు ఈ కథలో ఎన్నోసార్లు కనపడుతుంది.

కావ్యంలోని కథాసంవిధాన వైచిత్రి, కవిత్వ నిర్వచనానికి కావ్యములో చేసిన ప్రయత్నము, మణికంఠుని పూర్వగాథ, ఉత్తరచర్యలు, మణిస్తంభ సుముఖాసత్తుల పేర్లు, కథ , ఆరాధ్యదైవము, సరస్వతీ చతుర్ముఖుల రహస్యగాథ, కళాపూర్ణుడు, అభినవ కౌముది, మధుర లాలస మొదలైన వారి పేర్లు, కావ్యములోని తాత్విక విషయాలు, కావ్యప్రచారము. ఇంతేకాక దానికి కళాపూర్ణోదయమని పేరు పెట్టటము. ఇవ్వన్నీ సూరనగారి కళా ప్రతిభకు గుర్తులు.

కేరళలలో మృగేంద్రవాహనము వున్నది. కేరళ మంత్రగాళ్ళకు ప్రసిద్ధి. అలాగే కాశ్మీరములో కూడా. సరస్వతీ పీఠము గురించి విస్తారముగా ప్రస్థావించటము కూడా సూరనగారి కళాదృష్టికి, విస్తారమైన కావ్యదృష్టికి నిదర్శనము.

"దగదగయను పదకంబున
నిగనిగయను క్రొమ్మెరుంగు నేత్రపటమునన్
బుగబుగయను మేపూతన్
ఖగఖగ యనిపించే నతడు నా హృదయంబున్॥"(2-84)

ఇందులో జంట పద ప్రయోగము సూరనకు గల పద ప్రయోగ ప్రావీణ్యాన్ని చూపుతుంది.

సూరన రచనలో నీతి వాక్యాలు, సామెతలు, లోకనిరుక్తులు, కోకొల్లలు.

అద్భుతమైన అలంకార వృత్తాలతో శబ్దాలంకారాలతో, బిగువు తగ్గకుండా కథను నడిపి అందరిని దగ్గరకు చేర్చి కథలో వున్న ఉత్కంకరతను ను విడదీయటములో కూడా చక్కని నేర్పు చూపాడు.

ఇతని దృష్టిలో కవిత్వము పంచేంద్రియ తర్పకంగా ఉండాలి. చలువ గల వెన్నెలకు పరిమళము అద్దినట్లుగా వుండాలి. పదాల కూర్పు కూర్పులో ముత్యపు సొగసులుండాలి.

ఈ ఒక్క కావ్యము చాలునేమో తెలుగును ప్రపంచ సాహిత్యపు సింహాసనముపై కూర్చోపెట్టటానికి. మన తెలుగు కవులు పింగళి సూరనగారిని పల్లకిలో వూరేగించటానికి.

Ref:

కళాపూర్ణోదయము పీఠిక – కట్టమంచి రామలింగారెడ్డి.

పద్యకవితా పరిచయము – బేతవోలు రామబ్రహ్మం

సమగ్రఆంధ్ర సాహిత్యము – ఆరుద్ర

COMMENTS